విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 08, డిసెంబరు 2025

# పేద ప్రజలకు అండ సీపీఐ జెండా

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : పేద ప్రజలకు అండ సీపీఐ జెండా అని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు అన్నారు. ఆదివారం గోస్పాడు మండల కేంద్రంలో మండల మహాసభ సమావేశం మండల సహాయ కార్యదర్శి జిలాని బాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సోమన్న, మహిళా మండలి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి నంద్యాల జిల్లా నాయకులు గోకారి, గోస్పాడు మాజీ మండల కార్యదర్శి హరినాథ్ హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు మాట్లడుతూ స్వతంత్ర భారత దేశ చరిత్రలో 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, ప్రజా పోరాటంలో అలుపెరుగని పోరాటాలు చేస్తూ నిరంతరం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మతోన్మాద శక్తులను ప్రేరేపిస్తున్నటువంటి బిజెపి ప్రభుత్వాన్ని అందుకు వత్తాసు పలుకుతున్నటువంటి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మభ్యపెడుతూ కాలం గడుపుతున్నదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరపున అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కొన్ని పథకాలను మాత్రమే అమలు చేసి మరికొన్నిటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టాలని చుస్తే పెద్ద ఎత్తున ప్రజలను కలుపుకొని ఆందోళన కార్యక్రమలకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల నాయకులు, శాఖ సహాయ కార్యదర్శి మల్యాల రమేష్, సభ్యులు హుసేని, ఫాతిమా, కొలిమి హుస్సేనమ్మ, నడిపి వెంకటేశ్వర్లు, డి.ఉసేని, లక్ష్మీ, కంబగిరి, సుంకన్న, నాగులు, మంగలి సరోజ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక :** గోస్పాడు మండల కార్యదర్శి షేక్ జిలాని భాష, మండల సహాయ కార్యదర్శిలుగా షేక్ మౌలా, యన్ నాగరాజు 18 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

## అనధికార విద్యుత్ లైన్లను తొలగించండి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్.ఎస్.టి.ఆర్) పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతాలు, గ్రామాల్లో పెరుగుతున్న అనధికారిక విద్యుత్ లైన్ల, విద్యుత్ కనెక్షన్లపై పై చర్యలు తీసుకోవడం కోసం డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్, ఆత్మకూరు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు మధ్య ఒక సమన్వయ సమావేశం బైర్లుటి ఈకో-టూరిజం నందు ఆదివారం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో డిప్యూటీ డైరెక్టర్, విగ్నేష్ అప్పావు ఐఎఫ్ఎస్సి ఎన్ఎస్టి ఆర్పై ప్రాథమిక సమాచారం అందించారు. వారు రిజర్వ్ అటవీ ప్రాంతం యొక్క పర్యావరణ ప్రాముఖ్యత, అరణ్యాలు జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో నిర్వర్తించే కీలక పాత్ర,వన్యప్రాణి సంరక్షణ కోసం అటవీ శాఖ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని సూచించారు.హైదరాబాదు లోని హైటీకోస్ సంస్థకు చెందిన ఇమ్రాన్ సిద్దీక్ అటవీ సరిహద్దులో గల సమీప గ్రామాలు, సాగు పొలాల వద్ద వేటగాళ్లు అనధికారిక విద్యుత్ లైన్లను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో వివరించారు. ఇటువంటి అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లలు వలన అడవి జంతువులకు తీవ్ర ముప్పుగా మారుతున్నా యని, అడవి జంతువుల వేటకు విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఆత్మకూరు రేంజర్ ప్రణీత భాయ్,బైర్లూడి బైర్లూటీ రేంజ్ అధికారి కృష్ణ ప్రసాద్,అటవీశాఖ సిబ్బందిపాల్గొన్నారు.

## గెలుపోటములు సమానంగా స్వీకరించండి

విశాలాంధ్ర - బనగానపల్లె: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. జెన్ షిటోరియో కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెస్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన ఏపీ షిటోరియో కరాటే ఛాంపియన్ షిప్ - 2025 కార్యక్రమానికి బిసి రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యి కరాటే పోటీలను ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కరాటే ఒకప్పుడు కేవలం ఆత్మ రక్షణ కోసమే నేర్చుకునేవారని, ప్రస్తుతం కరాటేను క్రీడగా కూడా గుర్తించడం శుభ పరిణామం అన్నారు. ఏపీ ఎస్కేయు వైస్ ప్రెసిడెంట్ కె.ప్రతాప్ కుమార్, జెడ్ఎస్కెఏ నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ కళ్యాణ్, జనరల్ సెక్రెటరీ సూర్య వంశీల ఆధ్వర్యంలో పట్టణంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.ఒలంపిక్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్,నెహ్రూ విద్యాసంస్థల డైరెక్టర్ కోడూరు రవితేజ రెడ్డి ,టీడీపీ నాయకులు అల్తాఫ్, కరాటే క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వెలుగోడులో వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర - వెలుగోడు :పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతం అయింది. శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షులు అబ్దుల్ కలాం ప్రారంభించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించుకోవడం సంతోషదయకమని కలాం అన్నారు. మనిషి శరీరంలో దంతాలు ముఖ్యమైన బాగమని వాటిని జాగ్రత్తగా సంరక్షణ చేసుకోవాలని వైద్యులు అన్నారు. డా.కిరణ్, డా. కావ్యశ్రీలు రోగులను పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంచాలకట్ట భాస్కర్ రెడ్డి, అంబటి శ్రీనివాస రెడ్డి, శంకరరెడ్డి, టాప్ అయూబ్, అంకిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

విశాలాంధ్ర - చాగలమర్రి : క్రీడలు శారీరక,మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఆళ్ళగడ్డ రూరల్ సిఐ మురళిదర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఎస్పీజీ చర్చి 133వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీలను రూరల్ సిఐ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన 8జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు దాతలు విక్టర్ దేవదానం(బిఎస్ఎఫ్), బేతం ఓబన్న ఎస్ఐ వల్లూరు, ఎస్ఐలు ఇయన్ జె కెనడి, వీర ప్రతాప్‌లు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు రూ.15 వేలు దాతలు కడపకు చెందిన ఎం.శేఖరయ్య, జి.ఐజయ్య, దండు సంతోష్‌కుమార్ లు అందజేస్తారన్నారు. డీసరీ చైర్మను రెవ. చంద్రశేఖర్, డేవిడ్,గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ ఇండ్ల లక్ష్మిరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి,జగన్, బ్రహ్మం, శ్రీనివా సరెడ్డి, పిఈటీలు నందు, నరసింహుడు,సంఘం పెద్దలు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## భార్యపై దాడి కేసు నమోదు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల :మండలంలోని ఉమ్మాయిపల్లి గ్రామంలో భార్యపై దాడి చేసిన భర్త లక్ష్మీనారాయణ రెడ్డి,అతని బంధువులపై కేసు నమోదు చేసినట్లు సిఐ రమేష్ బాబు ఆదివారం తెలిపారు. సిఐ వివరాల మేరకు ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సుధారాణి నవంబర్ 28వ తేదీన తన భర్త లక్ష్మీనారాయణ రెడ్డి వద్ద ఉన్న చిన్న కొడుకును తీసుకు వెళ్లడానికి గ్రామానికి వచ్చింది. ఆమె లక్ష్మీనారాయణ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లగా భర్తతో పాటు అతని బంధువులు దాడి చేసి కొట్టారన్నారు. భార్య సుధారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## బ్యాంక్ చోరీ.. నాలుగు రోజుల్లో చేదించిన ఎస్ఐ

విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణంలోని ఎస్బిఐ బ్యాంక్‌లో మహిళ నగను చోరీ చేసిన కేసును వెలుగోడు ఎస్. ఐ సురేష్ చాకచక్యంగా టెక్నాలజీతో కేవలం 4రోజుల్లో చేదించడంతో పట్టణ ప్రముఖుల ప్రశంసలతో ఘనంగా సన్మానం పొందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2వ తేదీన వెలుగోడు పట్టణం ఎస్బి ఐ బ్యాంక్ లో మండలం లోని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన శివారెడ్డి భార్య నందమ్మ నాగమణి లోనుకు సంబంధించిన ఋణం చెల్లింపుల కొరకు నగలు తీసుకు రాగా, గుర్తు తెలియని దొంగలు తన బ్యాగ్ లో వున్న బంగారు ఆభరణమును దొంగలించుకొని పోయినారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెలుగోడు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి, నంద్యాల జిల్లా ఎస్పి వుత్తర్వుల మేరకు, ఆత్మకూర్ సబ్-డివిజన్ డిఎస్పి, ఆత్మకూర్ రూరల్ సర్కిల్ సిఐ సూచనల మేరకు తన సిబ్బంది సహాయంతో వెలుగోడు డిగ్రీ కాలేజీ దగ్గర నెరమునకు పాల్పడిన ముద్దాయిలు బాపట్ల జిల్లా, చీరాల టౌన్, వేటపాలెం కు చెందిన అన్నారెడ్డి లక్ష్మి అలియాస్ ఈశ్వరి, బాపట్ల జిల్లా చీరాల టౌన్, వి ఆర్ ఎస్ కాలేజీ వెనుక ఉన్న మోట రిబ్క ను అదే పై అడ్రస్‌లో ఉన్న మోట ప్రతాప్, అను వారిని ఆదివారం 09.30 గంటల సమయంలో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి దొంగలించుకుపోయిన 25 గ్రాముల బంగారు నాన్ పథకంను దాని విలువ సుమారు రూ.2లక్షల25వేలు స్వాధీనం చేసుకొని, నేరమునకు ఆటోను పంచాయతీదారుల సమక్షంలో స్వాధీనం చేసుకొని, ముద్దాయిలను కోర్టులో హాజరు పరచామని ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థుల సమస్యలు పట్టవా..!

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.రఘురాం మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకులతో కలసి మాట్లాడుతూ వర్షాకాలం ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంపౌండ్ ఆవరణలో వర్షపు నీరు నిలిచి అపరిశుభ్రంగా మారడంతో విద్యార్థులు క్లాస్ రూమ్కు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వర్షపు నీరు బయటికి వెళ్లేలా డ్రైనేజీ కాలువల ఏర్పాటుతోపాటు సీసీ రహదారిని ఏర్పాటు చేయాలన్నారు. నూతన ఒకేషనల్ కోర్సులను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. క్రీడల్లో రాణించేందుకు జిమ్ సెంటర్ను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి వీలుగా షెడ్డును నిర్మించడంతోపాటు మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాలకు నూతన నేమ్ బోర్డును ఏర్పాటు చేయాలని కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఏఎస్ఎఫ్ పట్టణ కమిటీ నాయకులు దుష్యంత్, ఆంజనేయులు , రవికుమార్, జగన్ ,వినయ్,అబ్దుల్లా సూరి, మార్ ఫరూక్,లు పాల్గొన్నారు.

## భూసమస్యలను తప్పక పరిష్కరిస్తాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం దేవనగర్ ప్రాంతంలోని నూరని మస్జీద్ నందు ఆ ప్రాంత ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ విచ్చేశారు.ఈ సందర్భంగా దేవనగర్, వీసీ కాలనీ ప్రాంతాలకు చెందిన నూరని మస్జీద్, అబూబకర్ మస్జీద్, ఇనాముల్ హాసన్ మస్జీద్, అక్స మస్జీద్, మోమిన్ మస్జీద్ తదితర 5 మస్జీద్‌ల కమిటీ సభ్యులు తమ మస్జీద్‌లకు సంబంధించిన రెవెన్యూ శాఖ సంబంధిత భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఫిరోజ్ వెంటనే స్పందించి, సంబంధిత ఆర్డీఓకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. మస్జీద్‌లకు సంబంధించిన రికార్డులను త్వరితగతిన పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ తక్షణ చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముస్లిం సమాజం తరఫున 5 మస్జీద్ కమిటీ సభ్యులు ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఫిరోజ్ చేస్తున్న కృషికి వారు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దస్తగిరి, మాజీ కౌన్సిలర్ మిద్దె హుస్సేని, 34వ వార్డు ఇంచార్జ్ అహ్మద్ హుస్సేన్, తాటికొండ బుగ్గరాముడు, గోవిందు నాయుడు,అబ్దుల్ గఫ్ఫార్, మస్జీద్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శఠగోపంలతో బెంబేలు

- వ్యాపారాల పేరుతో అందిన కాడికి అప్పులు
- ఆ తరువాత ముంచేస్తున్న కేటుగాళ్లు
- ఐపీ నోటీసులు,దొబ్బుడు పంచాయితీలు
- దగపడుతున్న పేదలు, రైతులు
- కళ్ళు ఎదుటే దర్జాగా బతుకుతున్న దొరలు

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల: కష్టపడి చెమటోర్చి సంపాదించుకున్న డబ్బులు మాయమవుతుంటే సామాన్యులు, రైతులు బెంబేలెత్తుతున్నారు. పైసా పైసా కూడాపెట్టుకున్న మొత్తాలను నమ్మిన వాడికి అప్పులిస్తే వాడు నట్టేట ముంచుతూ దర్జాగా బతుకుతున్నారు. బాధితులు మాత్రం కట్టుబట్టలతో మిగులుతున్నారు. నమ్మకమనే పెట్టుబడితో పరిచయాలు పెంచుకొని అందిన కాడికి కేటుగాళ్ళు అప్పులు చేస్తూ అప్పులు ఇచ్చిన వారిని నిండా ముంచుతున్నారు. పెద్దపెద్ద ఫైనాన్స్ వ్యాపారం లేదా ధాన్యం వ్యాపారాన్ని ప్రారంభించి అప్పులు లేదా ధాన్యం కొనుగోలు చేస్తూ కొన్ని సంవత్సరాలు సక్రమంగా చెల్లింపులు చేస్తూ నమ్మకాన్ని పెంచుకుంటారు. దీంతో వ్యాపారుని పేరు చుట్టుపక్కల గ్రామాలలో మారుమోగి అప్పులు ఇచ్చే వారు కూడా క్యూ కడతారు. వీరిలో చాలావరకు రైతులు తాము పండించిన ధాన్యని వ్యాపారునికి అప్పజెప్పి ప్రాంసరీ నోటు రాపించుకుంటారు. మరికొందరు ఆటో ఫైనాన్స్ రూపంలో అవతారమెత్తి డిపాజిట్ రూపంలో తెలిసిన వారి దగ్గర నుండి అప్పులు చేస్తారు. కొన్ని సంవత్సరాలు బాగా జరిగి అందిన కాడికి అప్పులు చేసిన తర్వాత తాము ప్రారంభించిన వ్యాపారాలు నష్టం వస్తున్నాయని బోర్డు తిప్పేస్తారు. ఆ తర్వాత న్యాయస్థానాలను ఆశ్రయించి అప్పిచ్చిన వారందరికీ ఐపి నోటీసులు పంపించి తాము వ్యాపారాల్లో నష్టపోయామని చెప్పి దర్జాగా తిరుగుతుంటారు. ఆ తర్వాత దొబ్బుడు పంచాయతీలు పెట్టిన నూటికి 10, 20 రూపాయలు ఇచ్చి మరోచోట దర్జాగా వ్యాపారం చేసుకుంటూ మోసగాళ్లు బతుకుతున్నారు. కొందరు నిజంగా నష్టపోయి ఉండొచ్చునెమోగానీ చాలా వరకు మాత్రం ఉన్న ఆస్తులు వారి పేరిటలేకున్నా ఆ ఆస్తులు అలాగే ఉంటున్నాయి.ఇలా నష్టపోయిన వారిలో ఎక్కువగా పేదలు ఉంటున్నారు. పేదలు రైతులు తమ బిడ్డల చదువు పెళ్లిళ్ల కోసం కూడబెట్టుకున్న సొమ్ము ఒక్కసారిగా తిరిగిరాని అప్పుగా మిగిలిపోతుండడంతో ఆవేదన చెందుతున్నారు. అమాయకంగా అప్పులు ఇచ్చిన వారికి మాత్రం కన్నీళ్లు మిగులుతున్నాయి. రెండు మూడు సంవత్సరాల నుండి మండల వ్యాప్తంగా అప్పులు ఇచ్చి మోసపోతున్న బాధితులు భారీగా ఉన్నారు. ఒక ఘటన షాక్ నుండి కోలుకున్న వారికి మరో మోసం చేసిన ఘటన వెలుగు చూస్తుండడంతో సామాన్యులు రైతులు పేదలు ఆందోళన చెందుతున్నారు. చాలామందికి బాధితులు ఐపి నోటీసులు అందుకుని తమలో తామే కుమిలిపోతున్నారు. కష్టించిన సొమ్ము పలానిచోట భద్రంగా ఉందని ధీమాగా ఉన్న బాధితులకు రాత్రికి రాత్రి కొందరు కేటుగాళ్ళు మాత్రం షాక్ ఇస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం అప్పులు ఇచ్చి మోసపోవద్దని నిత్యం అవగాహన కల్పిస్తున్న కొందరు మోసపోతూనే ఉన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

## వైభవంగా స్వర్ణరథోత్సవం

విశాలాంధ్ర- శ్రీశైలం: శ్రీశైలం మహా క్షేత్రంలో ఆరుద్రా నక్షత్రాన్ని పురస్క రించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. ఆరుద్రో త్సవంలో భాగంగా ఆదివారం నాడు వేకువ జామున శ్రీస్వామివారికి మహాన్యా సపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి స్వర్ణరథోత్సవం జరిపించబడింది. తరువాత రథారూఢులైన శ్రీస్వామి అమ్మవార్లకు విశేషపూజలు అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.00లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమై గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవంలో సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు సంప్రదాయ నృత్యం, ఏర్పాటు చేయటం జరిగింది. కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎ.వి. రమణ, జి.గంగమ్మ, డి.వెంకటేశ్వర్లు,ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, అర్చకస్వాములు,పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్రామ సింహాలతో భయం.. భయం

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్: మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో ప్రజలను నిద్రపోనియ్యకుండా కుక్కల బెడద వెంటాడుతోంది. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఆయా ప్రాంతాల్లో వెళ్లే పాదాచారులకు, ద్విచక్ర వాహనాల ప్రయాణికులకు వెంబడించి భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్కలు వెంబడించినప్పుడు వాహన చోదకులు భయపడి కిందపడి గాయాల పాలవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు మహిళలు కుక్కల వల్ల రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. ఇటీవలే జరిగిన కొన్ని సందర్భాలలో కుక్క కాటుకు బారిన పడిన వారిలో ఎక్కువగా చిన్న పిల్లలు గాయపడి చనిపోవడం జరిగింది. రాష్ట్ర మినిస్టర్ ఆర్ అండ్ బి శాఖ మాత్యులు బీసీ జనార్ధన్ రెడ్డి చొరవ తీసుకొని గ్రామపంచాయతీ అధికారులకు కుక్కల బెడదను తగ్గించాలని హుకుం జారీ చేసినా గాని అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. కుక్కల దాడిలో ఇంకొకరి ప్రాణం పోతే గాని అధికారులు చర్యలు తీసుకునే విధంగా కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - సంజామల: నంద్యాల జిల్లా సంజామల మండలం ముక్కమల్ల గ్రామం ఆల్వకొండ క్రాస్ వద్ద వెలసిన శ్రీ కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ట్రెజరర్ వి.వి.నరసింహామూర్తి, రెడ్ క్రాస్ సభ్యులు రాముడు,మధు అంబులెన్స్ డ్రైవర్ విజయ్ పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన త్యాగరాజుకు సన్మానం

విశాలాంధ్ర - నందికొట్కూరు : విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్ నుండి జూనియర్ అకౌంట్ ఆఫీసర్గా పదోన్నతి పొందిన సగినేల త్యాగరాజును పివి రావు నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆయనను ఘనంగా సన్మానం చేసి సత్కరిం చారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మాల జాతి ముద్దుబిడ్డ సగినేల త్యాగరాజు నాగటూరు గ్రామంలో జన్మించి, అక్కడే ప్రాథమిక విద్య, నందికొట్కూ రులో మాధ్య మిక విద్యను,ఉన్నత విద్యను అభ్యసించాడన్నారు. త్యాగరాజు విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్ నుండి జూనియర్ అకౌంటు ఆఫీసర్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం ఆళ్లగడ్డలో పనిచేస్తున్నారన్నారు. విధుల్లో చేరినప్పటి నుంచి అంచెలం చెలుగా ప్రమోషన్ పొందడం మాల జాతికే గర్వకారం అన్నారు. ఇంతటి అత్యున్న తమైన పదవిని అధిరోహించిన త్యాగరాజుకి కమిటీ సభ్యులు అందరం కలిసి పూలమాలతో సన్మానించి అభినందలు తెలిపారు. ఈ ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమంలో పివి రావు మాల మహానాడు నాయకులు పెరుమాళ్ళ మధు, బండారు శ్రీను, చరణ్ తేజ,సగినేల యేసు రత్నం,భాస్కర్ ,కేడెము ఏసురత్నం, చెరుకు నడిపెన్న, శెట్టి శేఖర్, దండు సునీల్ దాలు శీను, వేల్పుల యేసు రత్నం, బిచ్చన్న, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## శిల్పి దురుగడ్డ రవీంద్రచారి దంపతులకు సన్మానం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ లోని శ్రీశారద శిల్పకళామందిరం ఆవరణలో భవాని దీక్ష భక్త బృందం శ్రీ కాళికామాత ఆలయ కమిటీ చైర్మన్ , ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్రాచారి దంపతులను ఘనంగా సత్కరించారు. దీక్షలు స్వీకరించిన భవాని సంఘం ఆధ్వర్యంలో ఇటీవల చండీయాగం నిర్వహించారు. ఇందుకు భవానీలకు అన్ని విధాలుగా సహకరించిన శ్రీ కాళికామాత ఆలయ అధ్యక్షుడు అన్నదాత రవీంద్ర చార్లు దంపతులను భవానీలు శాలువా,పూలమాలతో సత్కరించారు.

## రైతులను వెంటాడుతున్న కష్టాలు

విశాలాంధ్ర - సంజామల : ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు రైతులను నష్టాలు వెంటాడుతున్నాయి. వరుసగా కురిసిన వానలకు పంట చేతికి వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట చేతికి వచ్చినా గాని గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కోరుకుపోయారు. మండలంలో రైతులు మినుము,వరి,మొక్కజొన్న పంటలను దాదాపుగా సాగు చేశారు. ఈ వానల వల్ల మొక్కజొన్న రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడి రాక వచ్చిన పంటను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. మినుము రైతులు ఎకరాకు 30 వేల పెట్టుబడి పెట్టిన గాని ఆశించిన స్థాయిలో దిగుబడి రాక నష్టం వాటిల్లిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా రైతులను దగా చేశారని ఉచిత పంట బీమా పథకాన్ని, ఇన్పుట్ సబ్సిడీ పథకాలకు మంగళం పాడారని రైతులు వాపోయారు. కొంతమంది రైతులకు పంట బాగా వచ్చినా గాని గిట్టుబాటు ధర లేక నష్టపోయామని తెలిపారు. కొంతమంది రైతులు పొలాలను కౌలుకి తీసుకొని మినుము, మిర్చి వేశారు. పంట బాగా వచ్చిందిలే అనుకునే లోపే గిట్టుబాటు ధర లేక నిరాశే మిగిలింది.

## నేడు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలో కర్రా సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా చేత కంటి వైద్య శిబిరము ఏర్పాటు చేసినట్లు కర్ర ఫౌండేషన్ నిర్వాహకులు కర్రా తేజ వర్ధన్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని మానవత సంస్థ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 వరకు కంటి వైద్య చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. శాంతి రాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కంటి విభాగం వారు ఈ మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొననున్నారు. కంటి చికిత్సలతో పాటు గుండె సంబంధ చికిత్స ఈసీజీ వంటి పరీక్షలు ఈ క్యాంపు లో ఏర్పాటు చేయడమైందని వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

## ఆళ్లగడ్డ వాసికి అరుదైన గౌరవం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కడపలో ఆళ్లగడ్డ వాసికి అరుదైన గౌరవం దక్కింది.. కడప పట్టణంలోని ఖాన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్ట్ 10వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాతలను గౌరవించే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజానికి అవసరమైన సమయంలో నిరంతరం రక్తదాన సేవలు అందిస్తూ పలువురి ప్రాణాలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తులను ఈ కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన "ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్" అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్ సేవలను ప్రత్యేకంగా గుర్తించిన ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం ఘనంగా ఆయనను సన్మానించారు. ఆళ్లగడ్డనియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా రక్తదాన శిబిరాల నిర్వహణ, యువతను ప్రేరేపించడం, అవసరమైన వారికి సకాలంలో రక్తం అందేలా కృషి చేయడంలో ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులలో రక్తదాతలను సమన్వయం చేసి అనేకమందికి ప్రాణదానం చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు సేవా సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు, సామాజిక కార్యకర్తలు, యువత పాల్గొని మహమ్మద్ హుస్సేన్ ను అభినందించారు.

## శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో ఫార్మర్స్ డే

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్, బాలాజీ కాంప్లెక్స్‌లో ఫార్మర్స్ డేను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణమంతా పచ్చదనం నిండిన 'గ్రీన్ మార్కెట్' వాతావరణంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. విద్యార్థులు రైతుల వేషధారణలో పాల్గొని తాము పెంచినట్లు సజీవంగా చూపిస్తూ వివిధ రకాల కూరగాయల స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలు ఇలా వ్యవసాయ జీవనాన్ని ప్రతిబింబిస్తూ సంతను సృష్టించగా తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని పిల్లల దగ్గర కూరగాయలను కొనుగోలు చేస్తూ వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సుధాకర్, వారి సతీమణి హాజరై ప్రతి స్టాల్‌ను సందర్శించి,విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ వారివద్ద నుండే కూరగాయలు కొనుగోలు చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

# రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

కమిటీని ఎన్నుకున్నారు

**విశాలాంధ్ర - పెద్దకడబూరు :** రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక సీపీఐ కార్యాలయం నందు రైతు సంఘం సమావేశం సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ అధ్యకతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టాల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు

**రైతు సంఘం నూతన మండల కమిటీ :** పెద్దకడబూరు మండల రైతు సంఘం నూతన కార్యదర్శిగా షేక్ ఇస్మాయిల్, సహాయ కార్యదర్శిగా దస్తగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జాఫర్ పటేల్, మండల అధ్యక్షులు షేక్ మహ్మద్ హుస్సేన్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి షేక్షావలి, అల్లాబకాష్, ఉసేన్ బాషా, దావూద్ అలీ, వలి బాషా తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతి ఘటించాలి

**విశాలాంధ్ర - ఆస్పరి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజయ్ బాబు, మునెప్పలు పిలుపునిచ్చారు. ఆదివారం ఆస్పరి సమీపంలోనే రామతీర్థం క్షేత్రంలో ఆలూరు తాలూకా ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశాన్ని ఏఐటియుసి తాలూకా అధ్యక్షులు కృష్ణమూర్తి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులు దీర్ఘకాల పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేవలం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి, కార్మికులను మోసం చేసిందని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ, దేశ సంపద మొత్తాన్ని కొద్ది మంది కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఆటో, హమాలీ, భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి,

పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, ఆశ, అంగనవాడి, మధ్యాహ్న భోజన సిబ్బంది వంటి స్కీమ్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలనీ, పీఎఫ్,ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజని, తాలూకా కార్యదర్శి రంగన్న, జిల్లా నాయకులు నరసరావు, ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షుడు హనుమంతు, అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆశ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు రాధమ్మ, ఉపాధ్యక్షురాలు రాధిక, ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు ప్రమీలమ్మ, నాగమణి, చిట్టెమ్మ, ఆశ వర్కర్లు మీనా, రాధా, హమాలీ సంఘం నాయకులు గంగన్న, గోపాల్, రాముడు, గోవిందు, పాండు, పవన్, వీరు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**జీపు జాతను ప్రారంభించిన గిడ్డయ్య :** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 10న అంబేద్కర్ సర్కిల్ వద్ద జరిగే రోడ్డుదిగ్బంధన నిరసన విజయవంతం చేయాలని పిలుపునిస్తూ నిర్వహించిన జీపు జాతను సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవనున్నారని తెలిపారు. మండలంలోని 33 గ్రామాలను సందర్శిస్తూ, రైతులను సమీకరించడం, ఆందోళనపై అవగాహన కల్పించడం జీపు జాత ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**విశాలాంధ్ర-కర్నూలు సీటీ:** జిల్లాలోని సర్వేయర్ల సమస్య లపరిష్కరానికి కృషి చేస్తానని ఏపీ సర్వే యర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు ఎల్.మద్దిలేటి అన్నారు. ఆదివారం ఆర్డీవో కాన్ఫరెన్స్ హల్‌లో కర్నూలు జిల్లా సర్వేయర్స్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కర్నూలు నగర పాలక సంస్థ లో సర్వేయర్ గా పని చేస్తున్న ఎల్.మద్దిలేటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాక్షులుగా డి.నాగేంద్రను ఎన్నుకున్నారు. సెక్రటరీగా విజయప్రకాష్, జాయింట్ సెక్రెటరీగా సాజిదా ఖనం, ట్రెజరర్‌గా ఎం.రమేష్ బాబు, మెంబర్స్‌గా బోయ రవీంద్ర ప్రవీణ్ కుమార్, రాజ్ కుమార్, షేక్ అబ్దుల్ ఖాదర్, వేణుగోపాల్ నాయుడు,నవీన్ కుమార్‌లను ఎన్నుకోవడం జరిగింది.

## మిత్రుడుకి ఆర్థిక సాయం

**విశాలాంధ్ర-గోనెగండ్ల:** మండల కేంద్రమైన జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ నందు చదువుకున్న 2002 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు వారి స్నేహితుడు ఎమ్మిగనూరు మండలం,రాళ్లదొడ్డి గ్రామంలో ఉండే బోయ మల్లికార్జున గత రెండు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు కాలు,చేయ, గాయాలు, అయ్యాయి. దాదాపు 25 సార్లు కాలు, చేయికి, ఆపరేషన్ చేశారు. ఈ విషయం తెలుసుకొని మిత్రులు తమ వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో అందరూ కలిసి అతి కొద్ది సమయంలోనే దాదాపు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా మిత్రుడు బోయ మల్లికార్జున ఇలా జరగడం చాలా బాధాకరమని ఇలాంటి సమయంలో మేము తనకు అండగా ఉంటామని మా మిత్రుడు బోయ మల్లికార్జున త్వరగా కోలుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో 2002 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు,బాబా పక్రుర్ ద్దీన్,నగిరి అక్బర్ వలి, పాండు, కరుణాకర్,భారతం బడేసావలి, జంగం ప్రకాష్,నాగలదిన్నె షరీఫ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్ఎమ్ఎమ్‌యస్ పరీక్షలు : డీఈవో

**విశాలాంధ్ర - కల్లూరు :** నేషనల్ మీన్స్ -కం -మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఆదివారం నగరంలోని బి క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించడమైనది. జిల్లాలో 4124 మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకోగా 3960 మంది హాజరయ్యారు. ఇందులో 164 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 20 ఏర్పాటు చేయడమైనది. కర్నూల్‌లో ఆరు ఆదోని 9 పత్తికొండ లో 9 కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాలలో పరీక్ష సజావుగా జరిగింది. ఇది జాతీయ ఆదాయ మరియు ప్రతిభ ఆధారిత వేతన పథక పరీక్షగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వం నిర్వహించే ఈ పరీక్షకు 8వ తరగతి విద్యార్థులు స్కాలర్షిప్ కోసం రాస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు ప్రతి నెలా స్కాలర్‌షిప్ అందుతుంది.

# ప్రజలందరూ సహకరిస్తేనే 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' సాధ్యం

- ▶▶14వ తేదీలోగా ఖాళీ స్థలాలు శుభ్రంగా ఉంచుకోవాలి
- ▶▶రహదారులపై జంతువులను తరలించేందుకు ప్రదేశాలు గుర్తిస్తాం
- ▶▶జన సమ్మర్థ సంస్థలు ప్రహరీ ఏర్పాటు చేసుకోవాలి
- ▶▶సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి
- ▶▶నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

**విశాలాంధ్ర - కర్నూలు సీటీ :** నగర ప్రజలందరూ సహకరిస్తేనే 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' సాధ్యమవుతుందని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను స్వచ్ఛత పనులు చేపట్టి మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలకు వినియోగించుకునే విధానాన్ని ఈ నెల 14 నుండి పునః ప్రారంభిస్తామని తెలిపారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానుల చిరునామా వివరాలు లభించకపోవడంతో కొంతమందికి నోటిసులు అందలేదని, దీంతో ప్రజల నుండి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఈ నెల 14న వరకు గడువు ఇస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. అనంతరం నోటిసులు అందినా, అందకపోయినా అపరిశుభ్ర ఖాళీ స్థలాల్లో కార్పొరేషన్ కార్యకలాపాలు చేస్తుందని, కాబట్టి ప్రజలు ఈ పత్రిక ప్రకటనే హెచ్చరికగా భావించాలని కోరారు. అదేవిధంగా రహదారులపై జంతువులు, పశువుల సంచారాన్ని ఉపేక్షించేది లేదని, ఏదైనా ప్రమాదాలు జరిగితే యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రహదారులపై సంచరించే జంతువులను 7రోజులపాటు ఉంచేందుకు ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రదేశాలను అన్వేషిస్తున్నామని, సంచరించే జంతువులను ఈ నెల 14న తేదీలోగా గుర్తిస్తామన్నారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ప్రకారం రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రార్థన మందిరాలు వంటి జన సమర్థ సంస్థలు వీధి కుక్కలు లోపలికి ప్రవేశించకుండా ప్రహరీ త్వరగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. హెూటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్‌లలో మిగిలిన ఆహారాన్ని రహదారులపై పాడేసి, వీధి కుక్కల బెడదను ఎక్కువ అయ్యేలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సి, డి వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, భవన నిర్మాణ వ్యర్థాలను కార్పొరేషన్ ద్వారా అనుమతి పొందిన వాహనాలకే అప్పగించాలని కోరారు. వాటిని లోతట్ట ప్రాంతాల్లో తాత్కాలిక రహదారి నిర్మాణానికి వినియోగించుకుంటామని, రీసైక్లింగ్‌కు పనికొచ్చే వాటిని జొహరపురం డంప్ యార్డు వద్దనున్న సి , డి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌కి తరలించి, ఇటుకల ద్వారా ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. నగర పరిధిలో సి , డి వేస్ట్ ఎక్కడైనా పడేస్తే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటే 7422992299 ఈ నెంబర్‌కి కాల్ చేయాలని, ప్లానింగ్ కార్యదర్శి వచ్చి, ట్రాక్టర్‌కి రూ.500, టిప్పర్‌కి రూ.వెయ్యి చొప్పున ఎంతైనా చెల్లించాల్సి ఉంటుందో చెప్తారని పేర్కొన్నారు. చలానను క్యూఆర్ ద్వారా అయినా చెల్లించే సదుపాయం ఉందన్నారు. పర్యావరణ హితం కోసం కలిసిరావాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, భద్రత, అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ 4 విధానాలకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తే, నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుకోవచ్చని స్పష్టం చేశారు.

## 8న నూతన జీవోలు దగ్ధం

**విశాలాంధ్ర - కర్నూలు :** కేంద్ర ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో 2025వ సంవత్సరం విత్తన చట్టాన్ని విద్యుత్ చట్టాన్ని తీసుకువచ్చి రైతులపై భారాలను మోపుతున్న చట్టాలను నిరసిస్తూ ఈనెల 8వ తేదీన బిల్లు యొక్క జీవోలను దగ్ధం చేయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె,జగన్నాథం, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు బొల్లవరం వెంకటస్వామి, సుగ్గన్న, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా తీసుకుని వచ్చే విద్యుత్ బిల్లు అక్కర్లేదని ఈనెల 8వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర ఈ బిల్లుల ప్రతులను దగ్ధం చేస్తున్నామని ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, రైతు కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## మాచాని రాజేంద్ర ప్రసాద్ మృతి విచారకరం : కోట్ల

**విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ :** ప్రముఖ పారిశ్రామికవేత్త కీ.శే. మాచాని సోమన్న పెద్ద కుమారుడు మాచాని రాజేంద్రప్రసాద్ ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మరణించడం జరిగింది. మాచాని రాజేంద్రప్రసాద్ మరణించిన విషయం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి హుటాహుటిన ఎమ్మిగనూరుకు చేరుకొని మాచాని రాజేంద్రప్రసాద్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. చేనేతల అభివృద్ధికి మాచాని సోమన్న కుటుంబం అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కోట్ల వెంట నివాళులర్పించిన వారిలో ఎమ్మిగనూరు టీడీపీ నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, మల్కాపురం పురుషోత్తమ రెడ్డి, మంత్రాలయం నియోజకవర్గం నాయకులు మురళీకృష్ణంరాజు (కోసిగి దొర), కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మాణిక్య రాజు తదితరులు ఉన్నారు.

## ఏఐటీయూసీ మండల కార్యదర్శిగా బి.విగ్నేష్

**విశాలాంధ్ర-గూడూరు:** గూడూరు మండలం ఏఐటీయూసీ మండల కార్యదర్శిగా బి.విగ్నేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గూడూరు మండలం ఏఐటీయూసీ నూతన కార్యవర్గ కమిటీని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులుగా బీడీల శ్రీనివాసులు, అధ్యక్షులుగా ఆటో ఓబులేష్, వర్కింగ్ అధ్యక్షులుగా సురేష్, ఉపాధ్యక్షులు గిరి, సహాయక కార్యదర్శిగా నాగరాజు, శివలను ఎన్నుకోగా కోశాధికారిగా ఈరన్నను ఎన్నుకున్నట్లు జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి మునెప్ప ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో ఏఐటీయూసీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తామని అన్నారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఏఐటీయూసీ పనిచేస్తుందని ప్రతి ఒక్కరూ బాధ్యతగా సేవలందించి కార్మికులకు అండగా నిలవాలని నూతన కార్యవర్గ సభ్యులకు మునెప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా హనుమంతు, దస్తగిరి, మధు, దేవేంద్ర, శ్రీనులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో పోటాపోటీగా..!



**విశాలాంధ్ర - ఆదోని :** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండోర్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు విద్యార్థులు పోటాపోటీగా పాల్గొని ప్రతిభ చాటారని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైఫుల్లా, కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీ మల్లికార్జున విద్యాలయ ఆవరణలో జోనల్ స్థాయి ఇండోర్ ఆటల పోటీల్లో రూబిక్ క్యూబ్, ఎలక్యూషన్, చెస్, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎంఈఓ భూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో కిడ్డీస్ మొదటి బహుమతి, రెండో బహుమతి అమరావతి పాఠశాల, మూడో బహుమతి అక్షర శ్రీ, రూబిక్ క్యూబ్ లో మొదటి బహుమతి చిన్నయవిద్యాలయ వీక్షిత్, రెండో బహుమతి నేషనల్ స్కూల్ రిహాన్, మూడోవ బహుమతి సెయింట్ జోష్ గణేష్, చెస్ గర్ల్స్ మొదటి బహుమతి చిన్మయ విద్యాలయ ప్రతిక్ష, రెండవ బహుమతి మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ స్కూల్ విద్యార్థిని రిజ్వాన, చెస్ సబ్ జూనియర్ అస్మిత కిడ్డీస్ రూట్, సమీరా మహమ్మద్ లీలాస్, సాయి వైష్ణవి బాయి లీలాస్, ఎలిక్యులేషన్ అక్షర శ్రీ వెంకట సాయి, స్టోన్ హిల్స్ మిథున, నేషనల్ హై స్కూల్ విద్యార్థిని యామిని, డ్రాయింగ్ లో అక్షర శ్రీ విద్యార్థిని అక్షయ, లీలా పాఠశాల విద్యార్థిని సోనాక్షి, కిషన్, వీరితోపాటు సీనియర్, జూనియర్ విభాగంలో గెలుపొందిన విద్యార్థులు విద్యార్థులకు రోటరీ క్లబ్ సర్టిఫికెట్లతోపాటు మెడల్స్ ను అందజేశారు. రోటరీ క్లబ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల బృందం పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ యూత్ ఆఫీసర్ సాబిర్ అహ్మద్, ట్రెజరర్ షణ్ముఖ, సభ్యులు జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, ప్రశాంత్ గాంధీ, భరత్ ష, శ్రీధర్ రెడ్డి, విట్ట మురళీధర్, రాచోటి సుబ్బయ్య, పద్మనాభయ్య శెట్టి, వికాస్ బండారి, సందీప్ రెడ్డి, హుస్సేన్ భాష, శివకుమార్, శేషయ్య, నితిన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

**విశాలాంధ్ర - కల్లూరు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ టిజి.భరత్ ఆధ్వర్యంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, నరసింహారెడ్డి నగర్ రైల్వే స్టేషన్ యందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 8వ తేదిన సోమవారం ఉదయం 9:30గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 19 కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. వీటిలో 1350 ఖాళీలు ఉన్నాయి. ఈ జాబ్ మేళాకు హాజరు అయ్యే నిరుద్యోగయువతీ,యువకులకు విద్యార్హతలు పదవ తరగతి,ఇంటర్ ఏదైనా డిగ్రీ, చదివి 18-35 సంవత్సరాల లోపు వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఈ జాబ్ మేళాలో ఎంపిక అయిన అభ్యర్థులకి నెలకి రూ.10వేల నుండి 30వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో రావాలని అర్హత కలిగిన నిరుద్యోగ యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాల కోసం 6302929570 నంబర్‌ను సంప్రదించగలరన్నారు.

## సచివాలయ నిర్మాణానికి స్థలం సిద్ధం..

**విశాలాంధ్ర - పెద్దకడబూరు :** మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో సచివాలయ భవన నిర్మాణానికి టీడీపీ నాయకులు నర్సిరెడ్డి తన పొలంలో స్థలం సిద్ధం చేశారు. గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి ఆరు సెంట్ల స్థలం విరాళంగా ఇస్తానని చెప్పిన మాట ప్రకారం ఆదివారం గ్రామ శివారుల్లోని తన పొలంలో జేసీబితో ద్వారా ముళ్ల కంపలను తొలగించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## నిరాశ్రయ వృద్ధులకు సేవలు అందించాలి

**విశాలాంధ్ర- కర్నూలు సీటీ:** విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అశోక్ నగర్‌లో ఉన్న పట్టణ నిరాశ్రయ వసతి గృహంలో నెలకు సరిపడా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ సర్వీస్ యూనిట్ మెంబర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం మనందరి బాధ్యత అని వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటూ సహాయ సహకారాన్ని అందించడం మన కర్తవ్యం అన్నారు.ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఉపాధ్యక్షులు శంకరప్ప మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ నిరాశ్రయ వృద్ధులను అదరించాలని పిలుపునిచ్చారు.రిటైర్డ్ డిఎస్పీ పాపారావు, పట్టణ నిరాశ్రయ గృహ నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## వేముగోడులో పందులు పట్టివేత

**విశాలాంధ్ర -గోనెగండ్ల:** మండల పరిధిలోని వేముగోడు గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా కలెక్టర్ ఏ.సిరి, జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్‌ల ఆదేశాల మేరకు గ్రామంలోని పందులను అధికారుల ఆధ్వర్యంలో పట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వేముగోడు గ్రామంలో పందులు వివిధ ప్రాంతంలోని వీధులలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని జిల్లా ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పందులను పట్టివేశామన్నారు. అలాగే పందుల పెంపకం దారులకు నోటీసు జారీ చేసినట్లు ఈఓఆర్‌డి అనంతసేన తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలకు జిల్లా జట్టు

**విశాలాంధ్ర - కర్నూలు :** ఈనెల 8, 9 తేదీలలో రాజమండ్రిలో జరిగే సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ రాష్ట్రస్థాయి ఉషు పోటీలలో జిల్లా జట్టుకు ఈరోజు డిఎస్ఏ అవుట్డోర్ స్టేడియంలో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఉషూ సంగం అధ్యక్షులు బిజినేపల్లి సందీప్ విచ్చేసి మాట్లాడుతూ కెలో ఇండియా రాష్ట్రస్థాయి ఉషూ పోటీలలో పాల్గొనే విద్యార్థినులకు అభినందిస్తూ చదువుతో పాటు ఉషూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని, మన జిల్లాకు పథకాలు తీసుకొని రావాలని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు టీజీవీ టీజీబి ఉషూ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో మంత్రి వర్యులు టీజీ భరత్ కర్నూల్ నగరంలో స్పోర్ట్స్ డెవలప్ చేస్తున్నారు అనంతరం జిల్లా ఉషూ అధ్యక్షులు బిజినేపల్లి సందీప్ దుస్తులను పంపిణీ చేశారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ70 మంది విద్యార్థులు 6ఈవెంట్లలో పాల్గొంటున్నారని, ఉపాధ్యక్షులు టి.కృష్ణ,జి.గీతాంజలి,మాస్టర్లు క్రాంతి, శ్రీనివాస్, నాగేంద్ర పాల్గొన్నారు.

# వైభవంగా స్వాములవారి మహా పాదయాత్ర

**విశాలాంధ్ర - కోడుమూరు :** కోడుమూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన స్వాములవారి మహా పాదయాత్ర ఆధ్యాత్మిక వైభవంతో ఎంతో శోభాయమానంగా సాగింది.మహా పాదయాత్ర,హిందూ సమ్మేళనం కార్యక్రమాలలో పాల్గొనేందుకు కోడుమూరుకు విచ్చేసిన విజయవాడ అష్టాక్షరి పీఠం..శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జియర్ స్వామి,తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేట,బిజ్వార్ గ్రామం, అంబాత్రయ క్షేత్ర శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వాములకు వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని శ్రీరాములవారి దేవాలయం వద్దకు చేరుకున్న వారికి శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్త ఎద్దుల మహేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు సాగర్ శర్మ పూర్ణకుంభంతో ఆహ్వానించి ఆలయంలోకి తీసుకువెళ్లారు. ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీరాములవారి దేవాలయం వద్ద ప్రత్యేక పూర్ణకుంభ స్వాగతంతో ప్రారంభమైన మహా పాదయాత్ర కోట్ల సర్కిల్,పాత బస్టాండ్,అంపయ్య సర్కిల్,కొత్త బస్టాండ్ నుంచి ప్రధాన రహదారుల మీదుగా హరి హర క్షేత్ర శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు అత్యంత శోభాయమానంగా సాగింది.చిన్నారులు,మహిళలు,యువకులు భారీ సంఖ్యలో పాల్గొని "జై శ్రీరామ్ జై శ్రీరామ్".."భారత్ మాతాకీ జై" నినాదాలతో కోడుమూరు వీధులను మారుమోగించారు.మహిళల కలశ హారతులతో సన్నాయిమేళం, దప్పుచప్పుళ్ళు,తప్పెట నాదాలు,కోలన్న ఆటలు,మేళ తాళాలతో భక్తజన సందోహం నృత్యాలు పాదయాత్రకు ప్రత్యేక అందాన్ని చేకూర్చాయి.ప్రతి భక్తుడు కాసాయ పతాకాలు ఎగురవేస్తూ ఆధ్యాత్మిక జ్వాలలను వెలిగించారు.పట్టణంలోని ఎమ్మిగనూరు రహదారిపై పునర్నిర్మాణమవుతున్న హరిహర క్షేత్ర శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు సాగిన ఈ పాదయాత్ర భక్తుల జేజేల మధ్య ముందుకు సాగి మార్గమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరచింది. భక్తుల సందోహంతో కోడుమూరు పట్టణం కిక్కిరిసిపోయి పాదయాత్ర ఆధ్యాత్మిక రంగులతో నిండిపోయింది.ఈ కార్యక్రమంలో ఎద్దుల సూర్యరెడ్డి, ఎద్దుల సత్యారెడ్డి,బీజేపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ ప్రముఖులు వినయ్ పవార్,నర్రా నాగేశ్వరరావు,పెనుమాడ రాజశేఖర్, నటరాజ్,బుజ్జి,రామకృష్ణ, పెనుమాడ రమేష్ ,పెనుమాడ కిరణ్, చిప్పే వీరేష్,బుగుడే శ్రీనివాసులు, గంగాధర్,కిషోర్ శెట్టిలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 08, డిసెంబరు 2025

# జ్ఞానాన్నిచ్చే వాడే పరమశివుడు..!

- ఆధ్యాత్మిక,అభ్యుదయానికి ప్రతీక పరిహార క్షేత్రం
- వృద్ధాశ్రమాలు,అనాధాశ్రమాలు లేని సమాజం రావాలి
- హిందూ ధర్మం సంపదలను భవిష్యత్ తరాలకివ్వాలి
- స్వాముల ఉద్బోధనతో ఆధ్యాత్మిక చైతన్యం

**విశాలాంధ్ర - కోడుమూరు :** కోడుమూరు పట్టణం ఆదివారం నాడు అరుదైన ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.హరి హర క్షేత్ర శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణాన్ని విజయవాడ అష్టాక్షరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి,తెలంగాణ రాష్ట్రం, నారాయణపేట,బిజ్వర్ గ్రామం అంబాత్రయ క్షేత్రాధిపతి శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వాములు సందర్శించారు.అక్కడ ఆలయ ధర్మకర్త ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం సందర్భంగా నిర్వహించిన విశేష కార్యక్రమాలకు రెండు పీఠాల పీఠాధిపతులు హాజరుకావడంతో పట్టణమంతా భక్తి ప్రవాహంగా మారిపోయింది.వేలాది భక్తుల సందోహంతో రహదారులన్నీ నిండిపోయి,కోడుమూరుకు అరుదైన శోభను తీసుకొచ్చాయి.కోడుమూరు పట్టణంలో నిర్వహించిన హిందూ ఆధ్యాత్మిక సమ్మేళనంలో ప్రముఖ పీఠాధిపతుల ఆధ్యాత్మిక సందేశాలు భక్తుల్లో విశేష ఆరాధనను రేకెత్తించాయి.వేలాది మంది పాల్గొనడంతో సభా ప్రాంగణం భక్తి జనసందోహంతో కళకళలాడింది.హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన విజయవాడ అష్టాక్షరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారు స్పష్టంగా,ఘాటుగా ధర్మసారాన్ని భక్తులకు వివరించారు.జ్ఞానాన్నిచ్చే వాడే పరమశివుడని ప్రారంభించిన ఆయన..జ్ఞానము, ఆనందము ఒకేచోట లభిస్తున్న ఈ హరిహర క్షేత్ర శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భవిష్యత్తులో దేదీప్యమానంగా విరాజిల్లుతుందని ఆకాంక్షించారు.హిందూ సమాజ స్థితిగతులపై ఆవేదన వ్యక్తం చేస్తూ..దేశంలో వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమాలు లేని సమాజం రావాలని స్వామి ఆశాభవం వ్యక్తం చేశారు.ప్రస్తుతం భారతదేశంలో ధర్మం ఒక పాదం పైనే నిలిచివున్నదని,ఆ ధర్మాన్ని నిలబెట్టేది ఇప్పటికీ పతివ్రతా స్త్రీమూర్తులేనని పేర్కొన్నారు. ధర్మానికి విరుద్ధంగా నడుస్తున్న పరిపాలకులలో ధర్మం లేనందున ప్రజా పరిపాలనలో అన్యాయాలు పెరిగాయన్నారు.పూజలు చేయడం కంటే ధర్మాన్ని ఆచరించడం గొప్పదని,ధర్మమే మనిషిని నిలబెడుతుందని స్వామివారు స్పష్టం చేశారు.హిందూ ధర్మాన్ని భవిష్యత్తు తరాలకు ప్రతిఒక్కరూ ఇవ్వాలని ఆయన కోరారు.సత్యం%-%ధర్మం నిలిచే సమాజమే అభ్యుదయానికి మార్గమని చెబుతూ "ఫేస్ ఈజ్ ఇండెక్స్ ఆఫ్ ద మైండ్" ముఖం మనసుకు అద్దం" అన్న భావాన్ని ఉదహరించి, శుద్ధచిత్తం,సత్ప్రవర్తన హిందూ జీవన విధానానికి ప్రాతిపదిక అని సూచించారు.

**ఆలయ నిర్మాణాలకు సహకరించడం హిందువుల ధర్మం : ఆదిత్య పరాశ్రీ స్వామి**

అనంతరం ప్రసంగించిన అంబాత్రయ క్షేత్రాధిపతి శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామివారు మాట్లాడుతూ హిందూ సమరసత,ధర్మబద్ధతపై భక్తులను చైతన్య పరుస్తూ హిందూ సమాజ సంఘటనలపై కీలక సందేశాలు చేశారు.ఆలయ నిర్మాణాలకు సహకరించడం ప్రతి హిందువుడి ధర్మం అని పేర్కొన్నారు.హిందూ సమాజ బలం ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉందని తెలియజేస్తూ..ప్రపంచంలోని ప్రతి ఖండంలో హిందువుల ఉనికే హిందూ సమరసత సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు.మతసామరస్యమే హిందువుల మూల స్వభావం అన్నారు.సనాతన ధర్మం శాశ్వతం అని సూచిస్తూ..ఈ భారతదేశం సనాతన ధర్మభూమి,ఇక్కడ ధర్మమే వర్ధిల్లాలి" అని పరాశ్రీ స్వామివారు పిలుపునిచ్చారు.స్వాములిద్దరి ఆధ్యాత్మిక ప్రసంగాలతో కోడుమూరులోని హిందూ సమ్మేళనం కార్యక్రమం భక్తి,ధర్మ చైతన్యంతో నిండిపోయి,సభకు హాజరైన భక్తులు ఆధ్యాత్మిక భావాలతో తరించారు.

## ఉద్యోగుల ఆక్రందనలు వినిపించడం లేదా..!

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** ఉద్యోగుల ఆక్రందనలు రాష్ట్ర ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ఎస్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎస్టీ యు నంద్యాల జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం నంద్యాల నేషనల్ పిజి కళాశాలలో జిల్లా అధ్యక్షుడు డి.మౌలాలి, ప్రధాన కార్యదర్శి యం.అజాంబేగ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, రాష్ట్ర కార్యదర్శులు ఈవి గోపాలకృష్ణ, ఇగ్బాల్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో గత 7 సంవత్సరాలుగా ఉన్న వేల కోట్ల రూపాయల బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోవడం, 4సంవత్సరాల క్రితం బిల్లు పెట్టుకొన్న సరెండర్ లీవుపై పట్టిపట్టనట్లు వ్యవహరించడం, గత ప్రభుత్వం బలవంతంగా అమలు చేసిన 11 పిఆర్సిని సరిచేయడంలో, 12వ పిఆర్సి కమీషన్ వేసి,మధ్యంతర భృతి చెల్లించడంలో గాని, దశాబ్దాల తరబడి ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్ మెంటు సమీక్షించి గరిష్ట పరిమితి 2 లక్షల నుండి 25 లక్షలకు పెంచకపోవడం, ఇహెచ్ఎస్ పథకం కొరకు ప్రతి నెలా ఉద్యోగులు 225-300 ప్రీమియం చెల్లిస్తున్నా వైద్యం అందని హెల్త్ కార్డులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల ఉద్యోగులు రగిలిపోతున్నారన్నారు. వీరి ఆక్రందనలు ప్రభుత్వం వినిపించుకోకమొద్దు నిద్రలో ఉంటే కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదంటూ నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశం లో జిల్లా పరిశీలకులు కె. సురేష్ బాబు, సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి, జి.వి.యెస్. ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరత్నంలు పాల్గొన్నారు. అలాగే ఎస్టీయు జిల్లా నూతన అధ్యక్షుడుగా ఎస్. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా యం. అజాంబేగ్, ఆర్థిక కార్యదర్శిగా నూరుల్లా, ఉపాధ్యాయవాణి కన్వీనర్ గా అమీర్, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, ఎన్నికల అధికారులుగా కె. సురేష్ బాబు, ఇలియాజ్ బాషా, మౌలాలి, శ్రీనివాసులు, వెంకట్ నాయక్, రఫీ, వేంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరపాలకలో పీజీఆర్‌యస్

**విశాలాంధ్ర - కర్నూలు సీటీ :** కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ఉదయం 11:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు.

## ఉచిత ఎముకల ధృడత్వ పరీక్షలు ఏర్పాటు

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లో జిఎస్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పేద, మధ్య తరగతి ప్రజలకు నంద్యాల ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ మొహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో బిఎండి ఉచిత పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు చేయించాలంటే దాదాపు 1800 ఖరీదుతో కూడుకున్నదని, నంద్యాల ప్రజలకు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు డాక్టర్ మొహమ్మద్ రఫీ తెలిపారు. ఈ పరీక్షలు ఎముకల సాంద్రతతో పాటు ధృడత్వం, అందుకు సంబంధించిన ముందస్తు సమాచారం తెలుసుకొని భవిష్యత్తులో ఎముకలకు సంబంధించిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఆరిఫాభాను పాల్గొన్నారు.

## అహోబిల దేవస్థానం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విఎల్ ఎన్.రామానుజన్

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం దేవ స్థానం చీఫ్ అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వి ఎల్ ఎన్.రామానుజన్ బాధ్యతలు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అహోబిలం దేవ స్థానం ముద్రకర్త, ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, దేవస్థాన సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** నంద్యాల పట్టణం హారుణ్ ఫంక్షన్ హాల్ నందు బ్రదర్ సతీష్ కల్వారి టెంపుల్, శాంతిరాం జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం వివిధ రకాల టెస్టులను చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించడానికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన కల్వారి టెంపుల్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవ సోదరుల సంక్షేమం కొరకు కృషి చేస్తుందని అతి త్వరలో పాస్టర్లకు గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మిద్దె హుస్సేని, 38వ వార్డు ఇంచార్జీ టి.బుగ్గరాముడు, మల్లెల భాస్కర్,అబ్దుల్ గఫార్, గోవిందనాయుడు, కల్వారి టెంపుల్ పాస్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## ఐక్యతను ప్రోత్సహిస్తూ అవగాహనా ర్యాలీ

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** తమిళ, భారతీయ సంప్రదాయాలలో నిక్షిప్తమైన నాగరికత మార్గాన్ని పునర్ అన్వేషిస్తూ సేజ్ అగస్త్య వెహికిల్ ఎక్స్‌పెడిషన్ బృందం నంద్యాలలో పర్యటించింది. సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భాషా ఐక్యతను ప్రోత్సహిస్తూ రాష్ట్రాల మధ్య అవగాహనను పెంపొందించడమే కాశీ తమిళ సంఘం ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సెషన్‌తో ఆరంభించారు. కెటిఎస్ 4.0లో భాగంగా నిర్వహిస్తున్న సేవ్ ఒక చారిత్రక కార్ ర్యాలీగా తమిళ, భారతీయ సంప్రదాయాలలో లోతుగా నిక్షిప్తమైన ప్రాచీన నాగరికత మార్గాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా సాగుతోందని, సేవ్ బృందం నంద్యాల జిల్లాకు చేరుకోగా ఆర్‌డీవో విశ్వనాథ్ వారికి స్వాగతం పలికారు. ఆర్‌డీవో సీ. విశ్వనాథ్,తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ యాత్ర విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణ రాయలసీమలోని నంద్యాల ప్రాంతం సమృద్ధిగా ఉన్న సాంస్కృతిక వారసత్వం, నంది దేవాలయాలతో ప్రసిద్ధి చెందిందన్నారు. డిసెంబర్ 2న తమిళనాడులోని తెంకాసి నుండి ప్రారంభమైన ఈ యాత్ర, మొత్తం 9 రోజుల ప్రయాణం అనంతరం డిసెంబర్ 10న కాశీ చేరుకోనుంది. సుమారు 20 కార్లు, 100 మంది పాల్గొన్న ఈ ర్యాలీ 2,460 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణిస్తున్నారు. సేజ్ అగస్త్యతో అనుబంధమైన పురాణ మార్గాన్ని అనుసరిస్తూ ఈ యాత్ర తమిళనాడి భారత జ్ఞాన వ్యవస్థలపై చేసిన విలువైన కృషిని ప్రతిబింబిస్తోందన్నారు.

# ఎమ్మెల్యే చొరవతోనే నిధులు మంజూరు

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పాతబడిన ఆరు దేవాలయాలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించారని టిడిపి మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, నల్లగట్ల టిడిపి గ్రామస్తులు అన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం నల్లగట్ల చెన్నకేశవ స్వామి దేవాలయం నిర్మాణంకు టిడిపి నాయకులకు కమిషన్ ఇవ్వాలంటూ వచ్చిన కథనాలను నల్లగట్ల టిడిపి నాయకులు, ఆళ్లగడ్డ మండల కన్వీనర్ శీలం హరి కుమార్ రెడ్డి లు తీవ్రంగా ఖండించారు. టిడిపి నాయకుడు గుర్రప్ప యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంత్రిగా ఉన్నప్పుడే చెన్నకేశవ స్వామి గుడి నిర్మాణం కు నిధులు మంజూరు చేయడం జరిగిందని కానీ ప్రభుత్వం మారడంతో ఆలయ నిర్మాణం ఆగిపోయిందన్నారు. వైసిపి నాయకులు కమిషన్ల కోసం కక్కుర్తి పడి గత ఐదు సంవత్సరాలు దేవుని మన్యం వేలంపాట వేయకుండా గుడి నిర్మాణాన్ని అడ్డుకొని గ్రామంలో చాలా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు.మళ్లీ టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకొని వెళ్లి ఎండోమెంట్ అధికారులతో మాట్లాడి గుడి నిర్మాణం కోసం మేము అందరమూ అర్జీలు ఇచ్చి కష్టపడుతుంటే వైసీపీ నాయకులు ఓర్వలేక ఇష్టం వచ్చినట్లుగా టిడిపి నాయకులు కమిషన్లు అడుగుతున్నారు అంటూ కథనాలురాయించడం పద్ధతిగా లేదని తెలిపారు.ప్రజల కోసం గుడి నిర్మాణం కోసం ఏదైనా ఉంటే సహాయం చేయాలని ఇలా లేనిపోని అబాండాలు వేయడంపద్ధతి కాదన్నారు. కచ్చితంగా నల్లగట్లలో చెన్నకేశవ స్వామి గుడి కట్టి తీరుతమని ఎవరు ఇక్కడ కమిషన్ల కోసంకక్కుర్తి పడటం లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కు ఎంతో చిత్తశుద్ధి ఉందని, ఆంధ్రప్రదేశ్ లో ఆలయాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, వైసీపీ నాయకులు అనవసర వ్యాఖ్యలు చేసి మీ విలువలను దిగజార్చుకోవద్దని మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి అన్నారు.

# విగ్రహావిష్కరణకు భారీగా తరలిరావాలి

**విశాలాంధ్ర -ఆలూరు :** ఆలూరు నియోజవర్గ కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ముందుగా ఆయన పుట్టినరోజు సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేయగా అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ, ఈ నెల 12న కర్నూల్ నగరంలో వాజ్ పేయి విగ్రహావిష్కరణను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి భారీగా నియోజవర్గం తరలిరావాలని చెప్పాడు, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్ పేయి సేవలను స్మరించుకునే ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజవర్గంలో బిజెపి బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త చురుకుగా పనిచేయాలని సూచించారు. పార్టీ ఎదుగుదలకు ఇది పునాది కావాలని తెలిపాడు, అలాగే గ్రామాల నుంచి పట్టణాల వరకు పార్టీకి మంచి స్థానం కల్పించేలా అందరూ కృషి చేయాలని చెప్పారు. అనంతరం గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజవర్గంలోని అన్ని గ్రామాలు, స్థానాలను కైవసం చేసుకోవడం పార్టీ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ విజయాన్ని నరేంద్ర మోదీకి ప్రత్యేక బహుమతిగా అందించాలని పిలుపునిచ్చారు. బిజెపి సీనియర్ నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ మాట్లాడుతూ, పార్టీ బలోపేతం కోసం తాను క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యటిస్తూనే ఉంటారని తెలిపారు. ప్రతి గ్రామానికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి పార్టీ ఆలోచనలను చేరవేస్తూ, నియోజవర్గ అభివృద్ధి దిశగా లోటుపాట్లను గుర్తించి పరిష్కార మార్గాలు సూచించడానికి కృషి చేస్తాను అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరాముడు, రాఘవేంద్ర స్వామి, విరూపాక్షి రెడ్డి, విటా కిష్టప్ప, బసవరాజ్, మహిళా నాయకులు, బిజెపి కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యాలయం సందడి, నాయకుల సందేశాలు, పార్టీ బలోపేతంపై చేసిన కీలక చర్చలతో సమావేశం విజయవంతంగా ముగిసింది.

# వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** వైద్య ఆరోగ్యశాఖకు చెందిన 12 మంది ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని రాష్ట్ర ఎన్జీవో సహా అధ్యక్షులు వంగల దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆళ్లగడ్డ తాలూకా ఎన్జీవో భవనంలో ఎన్జీవో నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో పల్నాడు జిల్లాలోని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య సిబ్బందిని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. హెల్త్ కమిషనర్ డిసెంబర్ మూడవ తేదీ సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఘనపవరాన్ని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందిని సస్పెండ్ చేయవలసినదిగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ వారికి సూచించి మొత్తం 12 మంది సిబ్బందిని సస్పెన్షన్ చేశారన్నారు. కానీ ఆ రోజు మొత్తం ఉద్యోగుల్లో 9మంది ఉద్యోగులు ఉదయం తొమ్మిది నుంచి నాలుగు గంటల వరకు విధులకు హాజరయ్యారు. మిగతా ముగ్గురు ఉద్యోగులు ఒకరు చైల్డ్ కేరు లీవ్ లోను మరియు మిగిలిన ఇద్దరూ ముందస్తు అనుమతితో సెలవులోనూ ఉన్నారు. ఈ విషయాలన్నీ గమనించకుండా ఎటువంటి విచారణ చేయకుండా మొత్తం 12 మంది సిబ్బందిని (సెలవులో ఉన్న సిబ్బందిని కూడా) సస్పెన్షన్ చేయడం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా రాష్ట్ర ఎన్జీవో అధ్యక్షులు దస్తగిరి రెడ్డి గారు అభివర్ణించారు. మొత్తం ప్రాథమిక ఆరోగ్య సిబ్బందిని సస్పెన్షన్ చేయడం రాష్ట్ర వైద్య శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, సిబ్బంది భర్తీ చేయకుండా 24 గంటల ఆసుపత్రిని నిర్వహించడం ఎలానో రాష్ట్ర అధికారులు తెలియచేయాలని కోరారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను భర్తీ చేయకుండా, ఉన్న సిబ్బందికి పని భారం పెంచుతూ మరియు వారిని సస్పెన్షన్ కి గురి చేయడం భావ్యం కాదని తెలియజేశారు.మరియు ఈ విషయాన్ని రాష్ట్ర అధ్యక్షులు సాగర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, ఈ సస్పెన్షన్ను ఎత్తివేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో తాలూకా అధ్యక్షులు ఐ.నాగార్జున రెడ్డి , సెక్రటరీ బాలస్వామి, ట్రెజరర్ శివచంద్రారెడ్డి, మరియు కార్యవర్గ సభ్యులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్వెటర్లు పంపిణీ

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** పట్టణంలోని చింతకుంట రహదారిలోని బాలసదనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డి.ఎస్.పి ప్రమోద్ చేతుల మీదుగా అనాథ విద్యార్థులకు ఆదివారం స్వెటర్లు పంపిణీ చేశారు. బాలసదనంలోని 45 మంది అనాథ పిల్లలకు దాదాపు 20 వేల రూపాయల విలువగల స్వెట్టర్‌లు పంపిణీ చేశారు. శబరిస్ సత్యం, డాక్టర్ వరప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ ధనలక్ష్మి, సత్యం, హెచ్ఎం మాధవి సహకరించినట్లు రోటరీ క్లబ్ బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలేపల్లి సత్యనారాయణ, సెక్రెటరీ బైసాని రవి ప్రకాష్, ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ కవిత, సెక్రెటరీ బైసాని ఉమామహేశ్వరి, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దేవిశెట్టి హరీష్ బాబు, సభ్యులు శబరీష్ సత్యం, మల్లేశ్వర్ రెడ్డి, బాలిరెడ్డి, మా టీవీ ప్రసాద్, టీఎంసీ వేణుగోపాల్, లాయర్ సుబ్బారెడ్డి, ఇన్నర్ వీల్ చార్టెడ్ ప్రెసిడెంట్ గాయత్రి దేవి, సభ్యులు గీత , మాధవి, స్వర్ణ పాల్గొన్నారు, ఈరోజు ముఖ్య స్పాన్సర్‌గా శబరిష్ సత్యం, స్పాన్సర్లుగా డాక్టర్ వరప్రసాద్, ధనలక్ష్మి సత్యం, టీఎంసీ వేణుగోపాల్, ఇన్నర్ వీల్ సభ్యురాలు హెడ్మాస్టర్ మాధవి మేడం సహకరించినట్లు రోటరీ క్లబ్ బృందం తెలిపారు.

## ఆధ్యాత్మికత శోభను పెంపొందించడమే పూజ ఉద్దేశ్యం

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** నంద్యాల పట్టణంలోని శ్రీ భద్రావతి భావన రుషి ఆలయంలో చింతలపల్లె వాసు ఆధ్వర్యంలో గురు భవాని పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురు భవాని మధు నిర్వాహణలో భవాని భక్తులు పాల్గొని దుర్గాభవాని మాతకు పూజలు నిర్వహించారు. అమ్మవారి భజనలతో ఆలయం ఆధ్యాత్మికత శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, డాక్టర్ సహదేవుడు, టిడిపి నాయకుడు, న్యాయవాది, మార్క్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తులసిరెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్లు శ్రీదేవి, మేడ మురళీధర్, జిల్లెల్ల శ్రీరాములు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా గత ఆరు సంవత్సరాల నుంచి భవాని దీక్షాపరులను ప్రోత్సహించడంలో భాగంగా ఆదివారం ఆలయంలో భవాని దీక్ష పూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందూ ధర్మాన్ని ఏ విధంగా ఆచరించాలో తెలియజేశారు. మన ఐక్యతే మన బలమని, ప్రతి ఒక్కరూ దీక్షలు నియమ నిష్ఠలతో చేస్తూ అమ్మ ఆశీర్వాద బలముతో హిందువులంతా సంఘటితంగా ఉండాలన్నారు.

## హక్కులను ఐక్యంగా సాధించుకుందాం

**విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ :** రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా ఆర్థికంగా ఉపాధి రంగాలలో అభివృద్ధి చెందే విధంగా అందరిని ఏకతాటిగా నడిపించి విశ్వబ్రాహ్మణుల హక్కులను సమస్యలను పరిష్కరించుకునే విధంగా నూతన కార్యవర్గ సంఘం హర్షించదగ్గ విషయమని ఆత్మకూరు మండల సంఘం అధ్యక్షుడు కె.ఎస్.మహేష్ ఆచారి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణుల నూతన సంఘానికి ముఖ్య అతిథులుగా ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన బాణాల మోహన్ ఆచారి,నరసింహ ఆచారి,పర్యావరణ ప్రేమికుడు వెంకటసుబ్బయ్య ఆచారిలు నూతన సంఘాన్ని ఎంపిక చేశారు. ఈ నూతన విశ్వబ్రాహ్మణుల సంఘం లో ఆత్మకూరు పట్టణానికి చెందిన అధ్యక్షులుగా కందుకూరి మహేష్ ఆచారి, ఉపాధ్యక్షులుగా మదన్ మోహన్ ఆచారి,ప్రధాన కార్యదర్శిగా మారుతీ ప్రసాద్ కృష్ణాపురం,ఉప కార్యదర్శిగా బాపనంతపురం గ్రామానికి చెందిన టి.మహేష్ ఆచారి, కోశాధికారిగా రామాచారి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శి కరివేన గ్రామానికి చెందిన నాగ శేషయ్య సుబ్బయ్య కురుకున్న గ్రామానికి చెందిన ఓంకారం ఆచారి రాఘవయ్య ఆచారి ఆత్మకూరు పట్టణానికి చెందిన కె.వి సురేష్ కుమార్ ఆచారి నరసింహ ఆచారి ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన బాణాల పవన్ కళ్యాణ్ ఆచారి సిద్దాపురం శేఖర్ ఆచారి బాపనంతపురం మహేష్ ఆచారిలతో కార్యవర్గం ఎంపిక చేసి నూతన సంఘాన్ని ప్రకటించారు.నూతన అధ్యక్షులు మాట్లాడుతూ యువతకు ప్రాధాన్యత కల్పించిన సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా రాజకీయంగా ఉపాధి అవకాశాలు లేక ఎంతోమంది నిరుద్యోగులు చదువుకొని ఇళ్ళకే పరిమితమైన వారందరికీ సంఘం తరపున మంచి ప్రోత్సాహం అందించి సంఘాన్ని బలోపేతం చేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. సంఘం నూతన కమిటీకి ముఖ్య అతిథులు ఘనంగా పూలమాలలు శాలువాలతో ఘన సన్మానం చేశారు.

## నంద్యాలలో క్రీడాభివృద్ధికి కృషి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల :** నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లోని నాయక్ టీ స్టాల్ వద్ద నంద్యాలకు చెందిన యువ డాక్టర్లు, వ్యాపారస్తులు, ప్రైవేట్ ఉద్యోగులతో కూడిన ఆర్ కె యూత్ టీం సభ్యుల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని ఆత్మీయంగా ముచ్చటించి వారితో కలిసి టీ సేవించారు. అనంతరం నంద్యాల పట్టణ అభివృద్ధి, క్రీడాభివృద్ధి, మౌలిక వసతులతో కూడిన క్రీడా మైదానాల అభివృద్ధి తదితర అంశాలపై యువత నుండి పలు సూచనలు స్వీకరించారు. ఈ విలువైన సూచనలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువెళ్లి, అవి అమలయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నంద్యాలను అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్లేందుకు యువతను భాగస్వామ్యం చేస్తూ వారి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకోని పనిచేస్తామని ఫిరోజ్ వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో డా. బద్రిష్, ప్రసాద్, అరవేటి రఘు,రమేష్ బాబు, కిషోర్, ఆడిటర్ భరత్, రవికుమార్, మనోజ్, ఉపేంద్ర, సైకిల్ పవన్, సురేంద్ర, జగన్, అఫ్సర్, అజర్, నూరుద్దీన్ టీడీపీ నాయకులు రంగ ప్రసాద్, మధుసాయి, బింగుమళ్ళ శ్యాం, కామిని మల్లికార్జున, మహబూబ్ జైలన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు రక్త పరీక్షలు

**విశాలాంధ్ర - కల్లూరు :** కర్నూల్ క్లస్టర్ యూనివర్సిటీ, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలోని బాలికల హాస్టల్ నందు కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఎల్లా కృష్ణ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు శాఖ వారి సహకారంతో రక్త గ్రూపు వర్గీకరణ, హిమోగ్లోబిన్ అంచనా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ అయిన డాక్టర్ జి శ్రీనివాస్ ప్రారంభించి ప్రతి ఒక్కరూ తమ రక్త వర్గాన్ని (ఏ, బి ,ఏబి, ఒ మరియు ఆర్ హెచ్ పాజిటివ్/నెగటివ్) తెలుసుకోవడం అవసరమని అలాగే హిమోగ్లోబిన్ స్థాయిని తెలుసుకోవడం ద్వారా రక్తహీనత (అనీమియా) వంటి సమస్యలను గుర్తించవచ్చని ముఖ్యంగా మహిళలు, పిల్లలలో ఇది సాధారణంగా కనిపించే సమస్య అని తెలిపారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్లా కృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరంగా సిల్వర్ జూబ్లీ కళాశాల హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్నటువంటి తమ విద్యార్థినిలలో రక్తహీనత వంటి సమస్యలు ఏమైనా ఉంటే గుర్తించడంతోపాటు అత్యవసర సమయంలో సరైన చికిత్స అందించడం కోసం రక్త గ్రూపు వర్గీకరణ అవసరాన్ని గుర్తించి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొంటూ ఈ శిబిరాన్ని నిర్వహించటకు సహకరించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూల్ శాఖ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల రసాయన శాఖ అధ్యాపకులైన డాక్టర్ కే నాగరాజ శెట్టి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూల్ జిల్లా కోఆర్డినేటర్ కె రమేష్ బాబు మరియు వారి తొమ్మిది మంది సభ్యుల బృందం పాల్గొన్నారు.